క్లుప్తంగా

కామాక్షిదేవికి వెండిచీర అలంకరణ



అలంకరణలో అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాండ్రంగివీధిలో కామాక్షీదేవి పీఠంలో శుక్రవారం అమ్మవారిని వెండి చీరతో అలంకరించారు. పీఠం నిర్వాహకులు వెదుల సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

లెర్నింగ్ సెంటర్ ఏర్పాటు



లెర్నింగ్ సెంటర్‌కు హాజరైన విద్యార్థులు

శ్రీకాకుళం రూరల్: ప్రతిఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని ఒప్పంగి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.ఉమాకుమారి అన్నారు. బెజ్జిపురం యూత్‌క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బెంగళూరు వారి సహకారంతో ఇండియా లిటరసీ ప్రాజెక్టులో భాగంగా ఒప్పంగిలో ఈ-లెర్నింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్‌పర్సన్, లెర్నింగ్ సెంటర్ నిర్వాహకుడు కొయ్యాన ఆనందరావు, యూత్‌క్లబ్ జెజ్జిపురం కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

రామిరెడ్డి గొప్ప దార్శనికుడు



రామిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వ్యవస్థాపక నాయకుడు, పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు దాచూరి రామిరెడ్డి గొప్ప దార్శనికుడని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ భవన్‌లో రామిరెడ్డి వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి, పూర్వ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, జిల్లా కార్యదర్శి హనుమంతు అన్నాజీరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.కోదండరామయ్య, త్రినాథరావు, విశ్వనాథరావు, పి.సురేష్‌కుమార్, బి.తౌడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నైరాలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని ఆచార్య ఎన్.జి.రంగా నైరా వ్యవసాయ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో కాలేజీ అసోసియేట్ డీన్ ఎం.భరతలక్ష్మి, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జయలక్ష్మీమాత జయంతి



పూజలందుకుంటున్న జయలక్ష్మీమాత

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చిం దత్తనాథ క్షేత్రంలో పరమ గురు జయలక్ష్మీ మాత జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అష్టోత్తర శత నామార్చన, లలితా సహస్రనామ పారాయణం, అష్టలక్ష్మీ స్తుతి పూజలు జరిగాయి. అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కుమార్‌రాజుకు ప్రశంసలు

శ్రీకాకుళం కల్చరల్: ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో డాక్టర్ కెసిరాజు శ్రీనివాస్ అధ్యక్షతన పెహల్గాం అమరజ్యోతి అంతర్జాల కవి సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. ఇందులో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు అమరులకు అశృతర్పణం అనే అంశంపై కవిత చెప్పడంతో అభినందన ప్రశంసాపత్రం అందించారు.

హద్దులు దాటుతున్న.. ఆక్రమణలు



ప్రభుత్వ భూమిలో గోడ కట్టిన దృశ్యం

- రాగోలు పరిసర ప్రాంతంలో ప్రభుత్వ భూముల కబ్జా
- ఆక్రమణ పాల్పడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు



రాగోలు పరిసర ప్రాంతంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి ఇదే

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు పరిసర ప్రాంతంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. స్థానికంగా నివాసముంటున్న వారితో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారులు సైతం భూకబ్జాలకు పాల్పడుతున్నారు. రాగోలులో సర్వేనెంబర్ 197, 211లో ఎకరాయాబై సెంట్ల స్థలం ఇప్పటికే ఆక్రమణకు గురైందని రెవెన్యూ శాఖ అధికారులే చెబుతున్నారు.

హద్దులు దాటుతున్నారు!

వాస్తవంగా రాగోలు జెమ్స్ ఆసుపత్రి వెనుక శ్రీ సిటీ నుంచి జెమ్స్ ఆసుపత్రి పరిసర ప్రాంతం వరకూ ఎకరా 50 సెంట్లు వరకూ కబ్జాకు గురైంది. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన జగనన్న భూ హక్కు పథకానికి సంబంధించిన భూమిలో సైతం రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా హద్దురాళ్లు వేయడం గమనార్హం. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం గమనార్హం. రాగోలు గ్రామానికి చెందిన సుమారు 15 మంది ఈ కబ్జాలకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆక్రమణలు తొలగించాలి..



రాగోలు పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. రెవన్యూ అధికారులు సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలి. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూమిలో సైతం హద్దులు వేస్తూ గోడలు కట్టేశారు.

– గేదేల చెంగల్వరావు, సర్పంచ్, రాగోలు

సర్వే చేయిస్తాం

రాగోలు పరిసర ప్రాంతంలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురైన విషయంపై సర్వే చేయిస్తాం. ఇప్పటికే ఈ ప్రాంతంలో కొంత ప్రభుత్వ భూమి ఉందన్న విషయం వాస్తవమే. ప్రభుత్వ భూమిని స్థానిక ప్రజల అవసరాలు నిమిత్తం కేటాయించాం. సర్వే చేసి స్వాధీనం చేసుకుంటాం.

– గణపతిరావు, తహసీల్దార్, శ్రీకాకుళం రూరల్ మండలం

సింహాచలం ఘటనపై మౌనమెందుకు?



కార్యక్రమంలో పాల్గొన్న గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: సింహాచలంలో గోడ కూలిన ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆనందపురంలో ఆయన మాట్లాడుతూ చందనోత్సవ ఘటనలో ఏడుగురు మృతిచెందినా డిప్యూటీ సీఎం, సనాతన ధర్మ ప్రతినిధిగా పిలుచుకునే పవన్ కల్యాణ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

అధికారం కోసం లేనిపోని ఆరోపణలు చేసి గద్దెనెక్కిన కూటమి నాయకులు ఇప్పుడెందుకు మాట్లాడటం లేదన్నారు. సంక్షేమ పథకాలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దోల వెంకటరమణ, వ్యవసాయశాఖ మాజీ చైర్మన్ మక్క వెంకటిసాయి, సర్పంచ్ చిత్తిరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆదిశంకరాచార్యుల జయంతి



ఉపనిషన్మందిరంలో శంకర జయంతి



కోదండరామాలయంలో శంకరాచార్యులకు పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కోదండ రామాలయంలో ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో క్షీరాభిషేకాలు, అష్టోత్తర శతనామార్చనలు, శాత్తుమురై నిర్వహించి తీర్థ గోష్ఠి చేశారు. పాలకొండ రోడ్డులోని ఉపనిషన్మందిరంలో శంకరాచార్యుల చిత్రపటం వద్ద దీపం వెలిగించి వేడుకలు నిర్వహించారు. శంకర అద్వైత సౌరభాలు అనే అంశంపై నిష్టల నర్సింహమూర్తి ప్రసంగించారు. కార్యక్రమంలో గుమ్మా నగేష్, పతంజలి శాస్త్రి, ఎం.మోహనరావు, ఎస్.నారాయణమూర్తి, డి.జి.పట్నాయక్, పి.బాబూరావు, వి.కామేశ్వరరావు, పి.ఈశ్వరరావు, పి.వి.ఎస్.ప్రసాద్, లక్ష్మీ, సరస్వతి, అనూరాధ పాల్గొన్నారు.

పొలంలో వ్యక్తి మృతి



మృతుడు కోటేశ్వరరావు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పాత్రునివలస గ్రామానికి చెందిన రావాడ కోటేశ్వరరావు(58) గురువారం రాత్రి బహిర్భూమికి వెళ్లిన సమయంలో ఫిట్స్ రావడంతో పొలంలోనే మృతిచెందాడు. ఈయన వైన్‌షాపులో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. విషయం తెలుసుకున్న సచివాలయం సిబ్బంది వెంటనే కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. మృతుడి కుమార్తె కొర్ని శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ రాము కేసు నమోదు చేశారు.

గమ్యం చేరే దారేదీ?



నవభారత్ జంక్షన్‌లో జాతీయ రహదారిపై సూచిక బోర్డును ఫ్లెక్సీతో కప్పేసిన దృశ్యం

- హైవే సూచిక బోర్డులపై కూటమి నేతల ఫ్లెక్సీలు
- గమ్యస్థానం దూరం వివరాలు తెలియక వాహనచోదకుల పాట్లు



రణస్థలంలో సమీపంలో హైవేపై సూచిక బోర్డు ఇలా..

ఎచ్చెర్ల క్యాంపస్/రణస్థలం: కూటమి నాయకుల ప్రచార తీరు హద్దులు దాటుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడికక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ వాహనచోదకులకు అసౌకర్యానికి గురిచేస్తున్నారు. ముఖ్యంగా జాతీయ రహదారిపై గమ్యస్థానాల వివరాలు తెలియజేసే సూచిక బోర్డులపై సైతం నాయకులకు స్వాగతం తెలియజేసే ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ నిబంధనలకు తూట్లుపొడుస్తున్నారు. జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల పరిధిలో పలుచోట్ల గమ్యస్థానాల హోర్డింగ్‌లు ఏర్పాటు చేసింది. వీటిపై పట్టణాలు, కిలోమీటర్ల సమాచారం ఉంటుంది. దూరప్రాంతాలకు ప్రయాణించే లారీలు, బస్సులు, కార్లు, బైక్ రైడర్లు, టూరిస్టులు వంటి వారికి ఇవి ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. అయితే రాజకీయ నాయకుల పుట్టిన రోజులు, పార్టీ కార్యక్రమాలు వంటి సమయాల్లో హోర్డింగ్‌లపైనే కూటమి నాయకులు ఫ్లెక్సీలు పెడుతున్నారు. సంబంధిత కార్యక్రమాలు పూర్తయ్యాక కూడా ఫ్లెక్సీలు తీయటం లేదు. హైవే అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఎచ్చెర్ల మండలంలోని నవభారత్ జంక్షన్, రణస్థలం మండలం బంటుపల్లి యూబీ పరిశ్రమ సమీపంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అమెరికా వెళ్లి వచ్చినందుకు గాను పెట్టిన బోర్డును నెల రోజులుగా అలాగే వదిలేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సూచిక బోర్డులు, హోర్డింగ్‌లపై ఫ్లెక్సీలు తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

చర్యలు చేపడుతున్నాం..

జాతీయ రహదారిపై సూచికల బోర్డులపై కొంతమంది రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు కట్టినట్లు మా దృష్టికి వచ్చింది. వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

– సీహెచ్ సతీష్, ఎన్‌హెచ్‌ఏఐ డిప్యూటీ మేనేజర్, విశాఖపట్నం

ఉమాజఠలేశ్వరుడికి అలంకరణ



ఉమాజఠలేశ్వరస్వామి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉమాజఠలేశ్వరస్వామికి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్ర పూజలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు అశ్వినికుమార్, మహేష్‌ల ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

చెట్టు విరగడంతో రాకపోకలకు అంతరాయం



రోడ్డుపై పడిన చెట్టు కొమ్మ

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని 33వ డివిజన్ గూనపాలెంలో రాజీవ్‌పార్కు వద్ద గురువారం రాత్రి వీచిన భారీ ఈదురుగాలులకు రోడ్డుకు అడ్డంగా చెట్టు కొమ్మ విరిగిపడింది. దీంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. పాదచారులు సైతం ఈ మార్గంలో నడిచేందుకు అవస్థలు పడ్డారు. మున్సిపల్ సిబ్బంది శుక్రవారం సాయంత్రం నాటికి కొమ్మను ముక్కలుగా నరకడంతో సమస్య తీరింది.

ఘనంగా కుంకుమార్చనలు



గాయిత్రీ అవతారంలో అమ్మవారు

ఎచ్చెర్ల: మండలంలోని కుంచాలకుర్మయ్యపేట గ్రామంలో గాయిత్రీదేవి అవతారంలో ఉన్న అమ్మవారికి శుక్రవారం కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బచ్చు నర్సింగరెడ్డి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

లక్ష్యం దిశగా ముందుకుసాగాలి



కొప్పలో అవగాహన కల్పిస్తున్న సచివాలయ ఉద్యోగులు

రణస్థలం/ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ నిర్దిష్ట లక్ష్యం దిశగా ముందుకు సాగాలని పంచాయతీ కార్యదర్శి ఆర్.శ్రీధర్ తెలిపారు. మండలంలోని కొప్ప గ్రామ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వం కౌమార బాలికల మనోవికాసానికి నిర్వహిస్తున్న కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, బాల్య వివాహాల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మహిళ పోలీసు బమ్మిడి అమ్మోజి, ఏఎన్‌ఎం చిన్నమ్మడు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ఎచ్చెర్ల మండలం కుప్పిలి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోనూ కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ యూనిట్ ప్రతినిధి ఇప్పిలి లక్ష్మన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రమైక్య జీవులు



ఒకప్పుడు పంట పొలాల పరిధిలోని బావుల్లో గానుగ పద్ధతిలో పూడికలు తీసేందుకు పశువులను వినియోగించేవారు. ఇప్పుడు వాటి లభ్యత ఎక్కువగా లేకపోవడంతో ఆ పనిని మనుషులే చేస్తున్నారు. జి.సిగడాం మండలం జి.సిగడాం – పొగిరి గ్రామాల మధ్య బావిలో ఉన్న చెత్తచెదారాలను ఇలా రైతులే కష్టపడి తొలగించారు.

- జి.సిగడాం

అరసవల్లిలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి



అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధి వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భారీ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. గతంలో కూడా ఇలాంటి ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఉన్నప్పటికీ.. తాజాగా మరింత పెద్దగా ఆలయం ప్రధాన రోడ్డు మధ్యలో అమర్చారు. వైశాఖమాసం నేపథ్యంలో ఆదివారం భక్తులు భారీగా రానున్న తరుణంలో వీఐపి వాహనాలకు, భక్తుల రాకపోకలకు అంతరాయం లేకుండా ఈ బ్రిడ్జిని సిద్ధం చేశారు.

-అరసవల్లి

పిచ్చిమొక్కలతో పాట్లు



లావేరు మండలం బొంతుపేట కూడలి నుంచి బుడతవలస, మెట్టవలస తదితర గ్రామాలకు వెళ్లే రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు పేరుకుపోయాయి. ఎదురెదురుగా వస్తున్న వాహనదారులు ముళ్లు, పిచ్చిమొక్కలతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- ఎచ్చెర్ల

అభివృద్ధి పనుల పరిశీలన

జి.సిగడాం: గ్రామ అభివృద్ధిలో భాగంగా నాణ్యతతో కూడిన పనులు చేపడుతున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు, దవళపేట సర్పంచ్ వడిశ మహేశ్వరరావు అన్నారు. శుక్రవారం గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తుల అవసరాల మేరకు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి, ఉపసర్పంచ్ పేడాడ శ్రీనివాసరావు, నీటి సంఘం డైరెక్టర్ బొడ్డేపల్లి ఉదయ్ కుమార్, కంచరాన రమణరావు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ ప్రారంభం



శిక్షణలో పాల్గొన్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లిలోని ఆదిత్యానగర్‌లో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మన సంస్కృతి, సంప్రదాయం తరగతులు ప్రారంభమయ్యాయి. నెలరోజుల పాటు తరగతులు నిర్వహిస్తామని నిర్వాహకులు గిరిజాకుమారి, రాజు తెలిపారు. 12 ఏళ్లలోపు విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు, శ్లోకాలు, క్రాఫ్ట్ శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కర్రసాము క్రీడాకారులకు అభినందనలు



ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో నిర్వాహకులు, క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్ : ఏలూరు జిల్లా కలిదిండిలో ఏప్రిల్ 30న నిర్వహించిన రాష్ట్రస్థాయి కర్రసాము(సిలంబం) పోటీల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన దేవ్స్ ఇండియన్ ట్రెడిషనల్ మార్షల్ ఆర్ట్స్ బృందం కోచ్ బలగ హర్షవర్ధన్ టీమ్ రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు క్రీడాకారులను అభినందించారు. అంతరించిపోతున్న ప్రాచీన క్రీడలకు మళ్లీ పూర్వ వైభవాన్ని తెచ్చే ప్రయత్నం చేస్తున్నామని స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్, కాసపు జోగినాయుడు, పీజీ గుప్తా, గుడ్ల సత్యనారాయణ తెలిపారు. కర్రసాము నేర్చుకొనే వారికి ఉచిత శిక్షణ ఇస్తున్న కోచ్ బి.హర్షవర్ధన్‌ను అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా శివ పార్వతుల కల్యాణం

ఎచ్చెర్ల క్యాంపస్: దుప్పలవలసలో భవానీ సహిత సోమేశ్వర ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివపార్వతుల కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.